

కోయిల్‌సాగర్ ప్రాజెక్టు గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

# కృష్ణా బేసిన్‌కు వరద

గద్వాల, సెప్టెంబర్ 26 : జూరాల ప్రాజెక్టుకు 97 వేల క్యూసెక్కులు చేరుతుండగా పది గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. పూర్తి స్థాయి నీటి నిల్వ 9.657 టీఎంసీలకుగానూ ప్రస్తుతం 8.830 టీఎంసీలు ఉన్నది. కాగా, ఎడమ కాల్వకు 730, కుడి కాల్వకు 350, భీమా లిఫ్ట్ –1 650, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 50, విద్యుదుత్పత్తికి 34,346 క్యూసెక్కులు వదలగా.. మొత్తం 1,06,543 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదైంది.

***టీబీ డ్యాంకు..***

అయిజ, సెప్టెంబర్ 26 : కర్ణాటకలోని ఆర్డీఎస్‌కు ఇన్‌ఫ్లో 9,310, అవుట్ ఫ్లో 8,700 క్యూసెక్కులుగా నమోదైంది. ఆయకట్టుకు 610 క్యూసెక్కులు విడుదల చేస్తుండగా ప్రస్తుతం ఆనకట్టలో 9 అడుగుల మేర నీటి మట్టం ఉన్నది. అదేవిధంగా తుంగభద్ర డ్యాంకు ఇన్‌ఫ్లో 11,350, అవుట్‌ఫ్లో 12,033 క్యూసెక్కులుగా నమోదైంది. 105.788 టీఎంసీల గరిష్ఠ సామర్థ్యం కలిగిన డ్యాంలో ప్రస్తుతం 101.148 టీఎంసీలు ఉన్నది.

***ఆల్మట్టి, నారాయణపూర్‌కు..***

ఆల్మట్టి డ్యాంకు ఇన్‌ఫ్లో 36,060, అవుట్‌ఫ్లో 36,060 క్యూసెక్కులు ఉండగా.. 128.19 టీఎంసీల నిల్వ ఉన్నది. నారాయణపూర్ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 75,000, అవుట్‌ఫ్లో 80,240 క్యూసెక్కులు ఉండగా.. 37.59 టీఎంసీలు నిల్వ ఉన్నాయి.

***కోయిల్‌సాగర్‌లో ఐదు గేట్లు ఓపెన్***

దేవరకద్ర, సెప్టెంబర్ 26 : కోయిల్‌సాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి భారీగా వరద వస్తుండడంతో ఐదు గేట్లు ఎత్తి 3,500 క్యూసెక్కులు ఊకచెట్టు వాగులోకి విడుదల చేశారు. అదేవిధంగా బుధవారం రాత్రి మండలంలో 36.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.




సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

## ఉత్తమంగా చదివి ఉన్నతంగా జీవించాలి

- డీఐఈవో అంజయ్య

ఆత్మకూరు, సెప్టెంబర్ 26 : విద్యార్థులు ఉత్తమంగా చదువుకొని జీవితంలో ఉన్నతంగా బతకాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి అంజయ్య అన్నారు. గురువారం ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫస్టియర్ విద్యార్థులకు సెకండియర్ విద్యార్థులు వెల్కమ్ పార్టీ నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన చదువుతోపాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలలోనూ విద్యార్థులు రాణించాలన్నారు. వరదబాధితుల సహాయార్థం జిల్లాలోనే ఆత్మకూరు ప్రభుత్వ కళాశాల తరపున విద్యార్థులు అందించిన సాయం ప్రథమస్థానంలో నిలిచిందని కొనియాడారు. ఈ విషయంలో ప్రిన్సిపాల్ భాగ్యవర్ధన్‌రెడ్డిని ఆయన అభినందించారు. అనంతరం విద్యార్థులు ఉత్సాహంగా సాంస్కతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో కొత్తకోట కళాశాల ప్రిన్సిపాల్ నరేంద్రకుమార్, పెబ్బేరు కళాశాల ప్రిన్సిపాల్ బద్రసేన్, విశ్రాంత ప్రిన్సిపాల్ రాజేశ్వర్‌రావు, అధ్యాపకులు విశ్వేశ్వర్, కురుమూర్తి, జమ్మన్న, రాఘవేందర్‌రావు, శ్వేత, వీణ, లలితమణి, చైతన్యరాణి, పావని, సునీల్, రాఘవేంద్ర, వి.బి.గౌడ్, బుచ్చయ్య, రామన్‌గౌడ్, సతీశ్, విమల పాల్గొన్నారు.

# సమగ్ర విచారణ చేపట్టాలి : ఎస్పీ

గద్వాల అర్బన్,సెప్టెంబర్ 26 : కేసులు నమోదు చేసిన తర్వాత సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఎస్పీ తోట శ్రీనివాస రావు పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసులతో గురువారం నెలవారి నేర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసుల వివరాలు, తీసుకున్న చర్యలపై ఆరా తీశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ప్రాపర్టీ కేసులను సరైన క్లూస్ సేకరించి త్వరగా ఛేదించాలన్నారు. కేసుల్లో పారదర్శకంగా వ్యవహరించాలని, పోక్సో కేసుల్లో నిష్పాక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు. దొంగతనం కేసులను ఛేదించి ఎత్తుకెళ్లిన సొమ్మును రికవరీ చేసి బాధితులకు అందజేయాలన్నారు. 28వ తేదీ జరిగే లోక్ అదాలత్ దృష్టిలో ఉంచుకొని సివిల్, కుటుంబ తగాదాలు, చిన్న చిన్న కేసుల్లో ఇరువర్గాలకు కౌన్సెలింగ్ నిర్వహించి రాజీ అయ్యేలా చూడాలన్నారు. మట్టి, ఇసుక, అక్రమ బియ్యం తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గతనెలలో ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులు యాంటీ నార్కొటిక్ అవగాహన సదస్సులు నిర్వహించి విద్యార్థులను చైతన్యం చేసినందుకు చీఫ్ కార్యాలయం పోలీస్ అధికారులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. వారిలో అయిజ ఎస్సై విజయ్ భాస్కర్, మానవపాడు ఎస్సై చంద్రకాంత్, శాంతినగర్ ఎస్సై సంతోశ్, కోదండాపూర్ ఎస్సై స్వాతి, ఇటిక్యాల ఎస్సై వెంకటేశ్, గట్టు ఎస్సై మల్లేశ్, కేటీదొడ్డి పాత ఎస్సై శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది ఉన్నారు. అనంతరం చాకలి ఐలమ్మ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ గుణశేఖర్, డీఎస్పీ సత్యనారాయణ, సాయుధ దళ డీఎస్పీ నరేందర్ రావు, సీఐలు, ఎస్సైలు ఉన్నారు.




సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ తోట శ్రీనివాస రావు



బాధితురాలికి ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

## సాయుధ పోరాటంలో ఐలమ్మ పాత్ర కీలకం

- ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

కొత్తకోట, సెప్టెంబర్ 26 : తెలంగాణ సాయుధ పోరాటంలో వీర వనిత చాకలి ఐలమ్మ పాత్ర కీలకమని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను స్థానిక కాంగ్రెస్ నాయకులు, రజక సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక చౌరస్తాలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ భూమి , భుక్తి , వెట్టి చాకిరి విముక్తి కోసం దొరలపై తిరుగుబాటు చేసి వేల ఎకరాల భూమిని పేదలకు పంచిన ఉక్కు మహిళా చాకలి ఐలమ్మ అని కొనియాడారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రశాంత్, కృష్ణారెడ్డి, బోయేజ్, శ్రీనివాస్‌రెడ్డి, మేస్త్రీ శ్రీని వాసులు, నరేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శేఖర్‌రెడ్డి, వెంకటేశ్, రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

***ఎల్‌వోసీ అందజేత***

కొత్తకోట పట్టణంలోని 14వ వార్డుకు చెందిన పద్మమ్మ అనారోగ్యానికి గురికాగా సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం నుంచి రూ.2.50లక్షల ఎల్‌వోసీ మంజూరు కాగా బాధితురాలికి ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్మికులకు శానిటేజర్లు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రశాంత్, బోయేజ్, కృష్ణారెడ్డి, మేస్త్రీ శ్రీను, శ్రీనివాస్‌రెడ్డి, క్రాంతి, ముంత రమణ, ముజీబ్ పాల్గొన్నారు.

## రేపు లోక్ అదాలత్ : జడ్జి కవితాదేవి

గద్వాల అర్బన్, సెప్టెంబర్ 26 : ప్రజలకు తక్కువ సమయంలో ఖర్చులు లేకుండా న్యాయం అందించడానికి లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జడ్జి గంట కవితాదేవి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని కేఎల్ఐ క్యాంపులోని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ కోర్టులో జడ్జి గంట కవితాదేవి గురువారం మాట్లాడుతూ ఈనెల 28న జాతీయ లోక్ అదాలత్ ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

లోక్ అదాలత్‌లో రాజీ అయ్యే కేసులను పరిష్కరించుకోవాలని కక్షిదారులకు సూచించారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కోర్టు సిబ్బంది ఉన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగి ఆత్మహత్య

- ఆర్థిక ఇబ్బందులతో ఆఫీస్‌లోనే బలవన్మరణం

గద్వాల అర్బన్, సెప్టెంబర్ 26 : కార్యాలయంలోనే ప్రభుత్వ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్న ఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకున్నది. గద్వాల టౌన్ ఎస్సై కల్యాణ్‌కుమార్ కథనం మేరకు.. జిల్లా కేంద్రానికి చెందిన అశోక్ (42) ఇరిగేషన్ డిపార్డ్‌మెంట్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. అయితే, కొన్ని రోజులుగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. గురువారం ఉదయం తోటి ఉద్యోగులు విధులకు హాజరయ్యేందుకు ఇరిగేషన్ కార్యాలయానికి వెళ్లగా.. అశోక్ ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకోవడం గమనించారు. మృతుడికి భార్య (టీచర్, ప్రభుత్వ ఉద్యోగి), కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.



అశోక్ (ఫైల్)

## ఆంగ్ల భాషపై పరిజ్ఞానం అవసరం

వనపర్తి టౌన్, సెప్టెంబర్ 26 : ఆంగ్ల భాష పరిజ్ఞానంతోనే భవిష్యత్ బంగారుమయమవుతుందని బీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల జడ్చర్ల అసిస్టెంట్ ప్రొఫెసర్ బైరెడ్డి సతీశ్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో విస్తృత ఉపన్యాసం (ఎక్స్టెన్షన్ లెక్చర్) నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో ఆంగ్ల భాష యొక్క ఆవశ్యకత, విద్యార్థి దశ నుంచే ఆంగ్లంపై పట్టు సాధించడం వల్ల భవిష్యత్తు బంగారుమయం అవుతుందన్నారు. ఇందులో భాగంగా విద్యార్థులకు ఆంగ్ల భాషపై పట్టు ఎలా సాధించాలో మెళకువలు, కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య, వైస్ ప్రిన్సిపాల్ రామరాజుయాదవ్, ఎగ్జామినేషన్ అకాడమీ కోఆర్డినేటర్ డాక్టర్ దామోదర్ రెడ్డి, ఆంగ్ల విభాగం హెచ్‌వోడీ యువరూపలక్ష్మి, ఆంగ్ల అధ్యాపకులు డాక్టర్ ఎండీ మహబూబ్‌పాషా, పరశురాముడు, రాములు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అక్షరాస్యత పెంపునకు కృషి చేయాలి

గద్వాలటౌన్, సెప్టెంబర్ 26 : జిల్లాలో అక్షరాస్యత పెంపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని న్యూ ఇండియా లిటరసి ప్రోగ్రాం జిల్లా ఇన్‌చార్జి అనిత అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం న్యూ ఇండియా లిటరసి ప్రోగ్రాం కార్యక్రమాన్ని నిర్వహించారు. చదువురాని వారికి చదువు నేర్పించే బాధ్యత విద్యార్థులు తీసుకోవాలని కోరారు. విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వలంటీర్లుగా మారాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వీరన్న, అధ్యాపకులు పాల్గొన్నారు.

## నాణ్యమైన భోజనం అందించాలి

ధరూరు, సెప్టెంబర్ 26 : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈవో రవీంద్రబాబు అన్నారు. మండలంలోని ఉప్పేరు జెడ్పీ ఉన్నత పాఠశాలను గురువారం ఆయన పరిశీలించారు. ముందుగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి శుభ్రంగా వండుతున్నారా లేదా అని వివరాలు సేకరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గౌరీశంకర్, సీఆర్పీ అజామ్‌పాషా పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శిని విధుల్లోకి తీసుకోవాలి

- కలెక్టర్‌కు వినతి అందజేసిన పుల్లికల్ వాసులు

గద్వాల అర్బన్,సెప్టెంబర్ 26 : పుల్లికల్ పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్‌ను విధుల్లోకి తీసుకోవాలని గ్రామస్తులు కలెక్టర్ సంతోష్‌ను కోరారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సంతోష్‌కు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 17వ తేదీన పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్‌ను అకారణంగా విధుల నుంచి తొలగించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. నిత్యం గ్రామంలో ఉంటూ ప్రజల అవసరాలనుగుణంగా వ్యవహరిస్తారే తప్పా ఎలాంటి ఇబ్బందులకు గురి చేయలేదని, అలాంటి అధికారి తిరిగి విధుల్లో తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు లోకేశ్, నర్సింహులు గౌడ్, రాముడు ఉన్నారు.

## భజన బృందానికి రూ.56వేల వితరణ

ఖిల్లాఘణపురం, సెప్టెంబర్ 26 : మండలంలోని గట్టుకాడిపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రతి నెలా 7వ తేదీన జరిగే ఆలయ మహోత్సవాల్లో పాల్గొనే భజన బృందానికి రూ.56వేలు గురువారం మానాజీపేట మేఘారెడ్డి వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ మహోత్సవాల్లో భాగంగా భజన బృందం అలరించే ఆటపాటలకు అవసరమయ్యే సంగీత వాయిద్యాలు అవసరమని ఆలయ భజన బృందం కోరగా స్పందించి రూ.56వేలు అందజేసినట్లు తెలిపారు. అనంతరం భజన బృందం సభ్యులు ,ఆలయ కమిటీ సభ్యులు మానాజీపేట మేఘారెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## కార్మికులను కాపాడుకుందాం

- మండల ప్రత్యేక అధికారి మలికార్జున్

మదనాపురం, సెప్టెంబర్ 26 : గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంలో గ్రామ పంచాయతీ కార్మికుల పాత్ర ఎంతో కీలకమని మండల ప్రత్యేక అధికారి మల్లికార్జున్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన జీపీ సిబ్బందితో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల ప్రత్యేక అధికారి మల్లికార్జున్ హాజరై మాట్లాడారు. జీపీ కార్మికులు ఎలాంటి రోగాల బారిన పడకుండా ముందస్తు చర్యగా పీహెచ్‌సీ సెంటర్‌లో అన్ని రకాల వైద్య పరిక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని తెలిపారు. అనంతరం కార్మికులకు నూతన దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో తాసీల్దార్ అబ్రహం లింకన్, ఎంపీడీవో ప్రసన్నకుమారి, కేవీకే శాస్త్రవేత్తలు రాజేందర్‌రెడ్డి, సురేశ్‌కుమార్, అనిత, పీహెచ్‌సీ వైద్యురాలు భవాని, పంచాయతీ కార్యదర్శులు, కార్మికులు, ఆరోగ్య వైద్య సిబ్బంది, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగన్న, కార్యదర్శి వడ్డెకృష్ణ పాల్గొన్నారు.

## నవంబర్‌లో రిజిస్ట్రేషన్ బాదుడు!

- భారీగా పెరగనున్న చార్జీలు

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ): నవంబర్ నుంచి సవరించిన చార్జీలను రిజిస్ట్రేషన్ చార్జీలను అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నది. వాస్తవానికి వ్యవసాయ, వ్యవసాయేతర, స్థిరాస్తుల రిజిస్ట్రేషన్‌కు కొత్త ధరలను ఆగస్టు 1 నుంచే అమలు చేయాలని భావించింది. ఈ మేరకు స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ జూన్‌లో షెడ్యూల్‌ను విడుదల చేసింది. అధికారులు జిల్లాల్లో అధ్యయనం చేసి ప్రభుత్వానికి జూలైలో నివేదిక ఇచ్చారు. ఈ నివేదికపై ప్రభుత్వం సంతృప్తి చెందలేదు. దీంతో ధరల సవరణ అధ్యయన బాధ్యతలను ఓ ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించారు. రాష్ట్రవ్యాప్తంగా సర్వే నంబర్ల వారీగా భూముల విలువను అధ్యయనం చేసి, ఎక్కడ పెంచేందుకు అవకాశం ఉన్నదో, ఎక్కడ తగ్గించాల్సి వస్తుందో, ఎంత మేర సవరించాలో సూచించాలని పేర్కొన్నది. ఈ మేరకు ప్రైవేట్ సంస్థ అధ్యయనం తుది దశకు చేరిందని రిజిస్ట్రేషన్ల శాఖ వర్గాలు తెలిపాయి.

**దక్షిణ మధ్య రైల్వే**
Follow us on X@SCRailwayindia
ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.inపై చూడవచ్చును.

టెండర్ ప్రకటన నెం.59 to 61 _DRM_W_HYB తేది: 24-09-2024

PUB/0949/24

దిగువ తెలిపిన పనుల కొరకు డివిజినల్ రైల్వే మేనేజర్/పనులు, హైదరాబాద్ డివిజన్, దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ వారు భారత రాష్ట్రపతి తరపున 18-10-2024న 15.00 గం.ల వరకు ఓపెన్ టెండర్లు కోరుతున్నారు.

**క్ర.సం.1, టెండర్ నెం.:** 59_DRM_W_ HYB, **పని పేరు:** 2 సంవత్సరాల (2024-26) కాలానికి ADEN/E-I/HYB & ADEN/E-II/ HBY అధికార పరిధిలో గ్రౌండ్ లెవల్ స్టోరేజ్ ట్యాంక్స్ /ఓవర్‌హెడ్ ట్యాంక్స్/రూఫ్ ట్యాంక్స్ కలాను గత క్లీనింగ్. **సుమారు విలువ:** రూ. 1,48,67,983, **బయానా:** రూ.2,24,300.

**క్ర.సం.2, టెండర్ నెం.:**60_DRM_W_ HYB, **పని పేరు:** SC-DHNE సెక్షన్: దూపాడు (DUU)–ట్రెయిన్ ఆపరేషన్స్ సులభతరం చేయుటకు మరియు గూడ్స్ ట్రాఫిక్ డీల్ చేయుటకు రెండు అదనపు లూప్ లైన్స్. **సుమారు విలువ:** రూ.99,40,881, **బయానా:** రూ.1,98,800.

**క్ర.సం.3, టెండర్ నెం.:** 61_DRM_W_ HYB, **పని పేరు:** SC-MUE సెక్షన్:1) SSE/ P.W/ MED సెక్షన్ పరిధిలో సెస్ రిపేర్. (2024-25 షార్ట్‌లిస్ట్ చేయబడిన సెస్ రిపేర్ వర్క్–86400Cum పార్ట్). **సుమారు విలువ:**రూ.1,12,10,561, **బయానా:** రూ.2,06,100.

**డివిజనల్ రైల్వే మేనేజర్, వర్క్స్,హైదరాబాద్**
A1223

**తదుపరి టెండరు నిబంధనలు/వివరాల కోసం మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కోసం వెబ్‌సైట్ https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in దర్శించండి**

# సహకార డెయిరీలకు సమాధి!

- **హైదరాబాద్ పాలమార్కెట్‌పై ఆధిపత్యానికి హెరిటేజ్ యత్నం**
- **సర్కారు ప్రోత్సాహంతో ప్రాంతేతరుల పెట్టుబడులు**
- **శ్వేత విప్లవానికి బాటలు వేసిన కేసీఆర్ ప్రభుత్వం**
- **స్వరాష్ట్ర రైతుల పుట్టిముంచుతున్న రేవంత్ సర్కారు**
- **ఒక్కో లీటర్‌పై రూ.4 నుంచి రూ.7 వ్యత్యాసం**
- **అదే ధరకు సేకరిస్తే రాష్ట్ర పాడి రైతుకు తీవ్ర నష్టం**



ఈ నెల 23న ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలో రోడ్డుపై పాలను పారపోసి నిరసన తెలుపుతున్న పాడి రైతులు

కరీంనగర్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పాడి రైతు మెడపై ప్రాంతేతరుల కత్తి వేలాడుతున్నది. స్వరాష్ట్రంలో శ్వేత విప్లవానికి కేసీఆర్ ప్రభుత్వం బాటలు వేస్తే.. కాంగ్రెస్ సర్కారు కుట్రల కారణంగా విజయ డెయిరీతోపాటు మిగిలిన కో ఆపరేటివ్ డెయిరీల మనుగడ కూడా ప్రమాదంలో పడే అవకాశం కనిపిస్తున్నది. ఏపీ సీఎం చంద్రబాబు కుటుంబానికి చెందిన హెరిటేజ్ సంస్థ రాష్ట్రంలో రూ.200 కోట్లకుపైగా పెట్టుబడితో శామీర్‌పేటలో డెయిరీతోపాటు ఐస్‌క్రీం తయారీ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయబోతున్నట్టు తెలుస్తున్నది. దీనికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంపూర్ణంగా సహకరిస్తున్నట్టు సమాచారం. రాష్ట్రంలో పాలవిక్రయాల అతి పెద్ద మార్కెట్ హైదరాబాద్. ఇక్కడ రోజుకు 20 లక్షల నుంచి 22 లక్షల లీటర్లకుపైగా డిమాండ్ ఉంది. ఈ డిమాండ్‌కు అనుగుణంగా మార్కెట్‌ను అందిపుచ్చుకోవడంలో విజయ డెయిరీ లాంటివి కాస్త వెనుకబడగా..ఇపుడు ఆ మార్కెట్‌ను ప్రాంతేతర డెయిరీలు ఆక్రమిస్తున్నాయి. హెరిటేజ్, జెర్సీ, అమూల్, నందిని వంటి డెయిరీలు.. స్థానిక డెయిరీలకు మించి మార్కెట్‌లో విక్రయాలు చేస్తున్నాయి. ఒక్క హెరిటేజ్ వాళ్లే రోజుకు హైదరాబాద్‌లో 5 లక్షల లీటర్లకు పైగా పాల విక్రయాలు చేస్తున్నట్టు సదరు రంగంలోని నిపుణులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఈ సంస్థ పెట్టుబడులు పెట్టి హైదరాబాద్ మార్కెట్ మొత్తం శాసిస్తే రాష్ట్రంలోని విజయ డెయిరీతోపాటు కోఆపరేటివ్ డెయిరీలైన కరీంనగర్, ముల్కనూరు వంటి వాటి భవిష్యత్‌పై నీలినీడలు కమ్ముకునే ప్రమాదమున్నది.

### రైతుల ఆదాయంపై దెబ్బ?

నిజానికి పాడి పరిశ్రమను ఆహ్వానించడం ఎవరూ తప్పుపట్టరు. కానీ సదరు పరిశ్రమతో రాష్ట్రంలోని పాడిరైతులకు వచ్చే ప్రమాదాలను పట్టించుకోకుండా రేవంత్ సర్కారు ముందుకెళ్తున్న తీరుపై విమర్శలొస్తున్నాయి. ఇప్పటికే హెరిటేజ్‌లాంటి సంస్థల దాటికి విజయ డెయిరీ కుదేలవుతుండగా.. ఇపుడు ఇతర కో–ఆపరేటివ్ డెయిరీలకూ ముప్పు పొంచిఉన్నది. దీనికి కారణం తెలంగాణతో పోలిస్తే ఆంధ్రాలో రైతులకు ఇచ్చే ఒక లీటర పాల ధరలో రూ.4 నుంచి రూ.7 వరకు వ్యత్యాసం ఉండడమే. ప్రస్తుతం 3 శాతం ఫ్యాట్ ఉన్న పాలను కరీంనగర్ డెయిరీ లీటర్‌కు రూ. 35.65కు కొనుగోలు చేస్తుండగా.. ఏపీలోని చిత్తూరులో రూ.31.50కు కొనుగోలు చేస్తున్నారు. 3.5 శాతం ఫ్యాట్ ఉన్న లీటర్‌పాలను చిత్తూరులో రూ.33కు కొనుగోలు చేస్తుండగా, కరీంనగర్ డెయిరీ రూ.40.25కు కొనుగోలు చేస్తున్నది. అంటే ఒక్కో లీటర్‌పై రూ.4 నుంచి రూ.7 వరకు తేడా ఉన్నది. అక్కడ తక్కువ ధరకు కొనుగోలు చేసి.. రాష్ట్రంలోని డెయిరీల మార్కెట్‌ను దెబ్బతీసేందుకు సరికొత్త స్కీమ్ పెట్టి లేదా.. ధర తగ్గించి సదరు కంపెనీలు పాలు అమ్మే పరిస్థితులు కనిపిస్తున్నాయి. హైదరాబాద్‌లో ఇప్పటికే పలు పాల కంపెనీలు ఈ తరహా మార్కెటింగ్‌కు పాల్పడుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రాంతేతర డెయిరీల పోటీని తట్టుకోవాలంటే రాష్ట్రంలోని కోఆపరేటివ్ డెయిరీలైన కరీంనగర్, ముల్కనూరు డెయిరీలు కూడా రైతుకు ఇచ్చే పాలసేకరణ ధరను తగ్గించాల్సి ఉంటుంది. పాల ధర తగ్గించకపోతే మార్కెట్ విక్రయాల్లో ఈ డెయిరీలు వెనుకబడిపోయే ప్రమాదమున్నది. తద్వారా డెయిరీలే మూతపడే ప్రమాదమున్నది. అదే జరిగితే కరీంనగర్, మూల్కనూరు డెయిరీ పరిధిలోనే దాదాపు 3 లక్షలకు పైగా పాడి కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదమున్నది. ప్రాంతేతర డెయిరీల మార్కెట్‌కు దీటుగా పాలసేకరణ ధరలు తగ్గిస్తే రైతులకు గిట్టుబాటు కావన్నది నిపుణుల అభిప్రాయం. ఆంధ్రాలోని పాడిరైతులకు వచ్చే ఖర్చుతో పోల్చితే.. తెలంగాణలో వాతావారణం, ఇతర మార్పుల నేపథ్యంలో 25 శాతానికిపైగా అదనపు ఖర్చు వస్తుందని పాడిపరిశ్రమ నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఇక్కడి రైతాంగానికి సరిపడా రేటు గిట్టుబాటు అయ్యేందుకు కావాల్సిన చర్యలపై ప్రభుత్వం దృష్టిపెటాలన్న అభిప్రాయాలు వ్యక్తవుతున్నాయి.

## యువతిపై ప్రేమోన్మాది దాడి



సాయికుమార్ (ఫైల్)

రామంతాపూర్, సెప్టెంబర్ 26: ఓ యువతిపై ప్రేమోన్మాది దాడి చేసిన ఘటన ఉప్పల్ బస్‌స్టాప్ వద్ద గురువారం చోటుచేసుకుంది. భువనగిరికి చెందిన రాగల సాయికుమార్(24), ఓ యువతి గతంలో ప్రేమించుకోగా.. మనస్పర్థలు రావడంతో విడిపోయారు. చాలా రోజుల తర్వాత ఈ ఇద్దరూ గురువారం ఉప్పల్ బస్‌స్టాప్ వద్ద కలుసుకోగా.. తనను ప్రేమించాలంటూ సాయికుమార్ యువతిపై ఒత్తిడి చేశాడు. ఇద్దరి మధ్య మాటామాటా పెరగడంతో ఆమెపై కత్తితో దాడిచేశాడు. యువతి వేలికి గాయం కాగా, స్థానికులు ఆమెను చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించారు. ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



పాఠశాల విద్య డైరెక్టర్ ఈవీ నరసింహారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న యూఎస్‌పీసీ సభ్యులు

## రేపు యూఎస్‌పీసీ, ఎస్జీటీయూ నిరసనలు

- **జీవో 25ను సవరించాలని డిమాండ్**

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ) : సర్దుబాటుకు ముందే బదిలీ అయిన ఎస్జీటీలను రిలీవ్ చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం సాయంత్రం అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసనలు తెలిపి కలెక్టర్లకు వినతిపత్రాలు ఇవ్వాలని యూఎస్‌పీసీ, ఎస్జీటీయూ పిలుపునిచ్చాయి. మరోవైపు జీవో 25లోని నిబంధనలు సవరించాలని కోరుతూ గురువారం యూఎస్‌పీసీ స్టీరింగ్ కమిటీ సభ్యులు కే జంగయ్య, పీ నాగిరెడ్డి పాఠశాల విద్య డైరెక్టర్ ఈవీ నరసింహారెడ్డి, విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశాన్ని కలిసి వినతిపత్రాలు అందజేయగా, ఎస్జీటీ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహిపాల్‌రెడ్డి, వెంకటేశం సైతం వినతిపత్రం సమర్పించారు.

## జైనూర్ ఘటనపై విచారణ చేపట్టాలి



ఖైరతాబాద్, సెప్టెంబర్ 26: ఆదిలాబాద్ జిల్లా జైనూర్‌లో ఈ నెల 4న జరిగిన ఘటనపై ప్రభుత్వం పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని పీవోడబ్ల్యూ నాయకురాలు సంధ్య డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సామాజిక, పౌర హక్కుల కార్యకర్తలు ఖలీదా పర్వీన్, సరా మాథ్యూస్, మసూద్, ప్రొఫెసర్ పద్మజాషాతో కలిసి మాట్లాడారు. జైనూరులో ఉద్దేశపూర్వకంగానే ఒక వర్గంపై దాడులు, దౌర్జన్యాలు జరిగాయని, దీనిపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు.

## సగం చేపపిల్లలకు సర్కారు కోత

- **తొలుత 85 కోట్ల పిల్లల పంపిణీకి ఏర్పాట్లు**
- **టెండర్ల సమయానికి 40కోట్లకే పరిమితి**
- **కాంగ్రెస్ ప్రభుత్వం నిధులవ్వకనే ఈ దుస్థితి**
- **నాలుగుసార్లు టెండర్లు పిలిచినా స్పందన కరువు**
- **బకాయిలపై ప్రశ్నించిన రైతులకు బెదిరింపులు**

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ): ఉచిత చేపపిల్లల పంపిణీలో ప్రభుత్వం కోత పెట్టింది. సగానికి సగం కోత పెట్టిన ప్రభుత్వం 50శాతం చేపపిల్లల్ని మాత్రమే పంపిణీ చేయాలని నిర్ణయించింది. తొలుత 85 కోట్ల చేపపిల్లల పంపిణీకి ప్రణాళికలు రూపొందించిన మత్స్యశాఖ.. టెండర్ల సమయానికి 40 కోట్లకే పరిమితం చేసింది. చేపపిల్లల పంపిణీలో కోతకు ప్రభుత్వం తగినన్ని నిధులు ఇవ్వకపోవడమే కారణమని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఉన్న నిధులతో 40కోట్లు పంపిణీ చేస్తామని, ప్రభుత్వం నిధులిస్తే మిగిలిన సగం పంపిణీ చేస్తామని స్పష్టం చేస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతియేట 80 కోట్ల చేపల పిల్లల్ని, మరో 10 కోట్ల రొయ్య పిల్లల్ని పంపిణీ చేసేంది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తొలి ఏడాదే చేపపిల్లల పంపిణీకి కోత పెట్టడంపై మత్స్యకారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### నాలుగుసార్లు టెండర్లు పిలిచినా...

ఈ ఏడాది చేపపిల్లల పంపిణీకి మత్స్యశాఖ ఆపసోపాలుపడుతున్నది. జూలై 9నుంచి నేటి వరకు టెండర్ల ప్రక్రియ కొనసాగుతూనే ఉన్నది. రెండున్నర నెలల్లో నాలుగుసార్లు టెండర్లు పిలిచినా పంపిణీదారుల నుంచి స్పందన కరువైంది. గతేడాది బకాయిలు కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా ఇవ్వకపోవడంతో పంపిణీదారులు ముందుకు రావడం లేదు. పాత బకాయిలు ఇస్తేనే టెండర్లలో పాల్గొంటామని పంపిణీదారులు చెబుతున్నారు. తొలుత పిలిచిన టెండర్‌లో ఒకే ఒక దరఖాస్తురాగా, రెండోసారికి 4దరఖాస్తులు వచ్చాయి. మూడోసారి 27వరకు దరఖాస్తులు వచ్చినట్టుగా తెలిసింది. ఇందులో కొంతమందికి వెరిఫికేషన్‌లో చేపల చెరువులు లేకపోవడంతో వారిని తిరస్కరించారు. ఇప్పుడు 19 జిల్లాలకు దరఖాస్తులు ఓకే కాగా 12 జిల్లాలకు మళ్లీ దరఖాస్తులు పిలిచారు. వీటి ప్రక్రియ ఎప్పుడు పూర్తవుతుందో కూడా తెలియని పరిస్థితి నెలకొన్నది.



### బ్లాక్‌లిస్టులో పెడుతాం

చేపల పంపిణీ రైతులపై మత్స్యశాఖలోని అధికారులు బెదిరింపులకు దిగుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాత పంపిణీదారు రైతులను పిలిపించిన అధికారులు.. వారం పది రోజుల్లో బకాయిలు ఇప్పిస్తామని హామీ ఇచ్చి టెండర్లలో పాల్గొనాల్సిందిగా కోరినట్టు ఓ పంపిణీదారు తెలిపారు. అధికారుల హామీతో టెండర్లలో పాల్గొన్నామని, పదిహేను రోజులు గడిచినా బకాయిల ఊసెత్తడంలేదని తెలిపారు. దీనిపై అధికారులను ఆరా తీస్తే.. బకాయిలు ఇచ్చే పరిస్థితిలేదని, టెండర్‌లో ఎంపికైన వాళ్లు అగ్రిమెంట్ చేసుకోవాలని ఆదేశించినట్టుగా తెలిసింది. రైతులు అగ్రిమెంట్‌కు నిరాకరించగా 'మీ బకాయిలు ఎలా వస్తాయో చూస్తాం. మీ డిపాజిట్ డబ్బులను బ్లాక్ చేస్తాం. మళ్లీ టెండర్లలో పాల్గొనకుండా బ్లాక్‌లిస్టులో పెడతాం' అంటూ బెదిరించినట్టుగా ఓ పంపిణీదారు ఆవేదనను వ్యక్తం చేశారు.

### పంపిణీ ఇంకెప్పుడు ?

ఈ ఏడాది ఆగస్టులో ప్రారంభంకావాల్సిన చేపల పంపిణీ ప్రక్రియ సెప్టెంబర్ పూర్తవుతున్నా టెండర్ దశలోనే ఉంది. పంపిణీ ఆలస్యమవుతుండడంతో ఏప్రిల్ వరకు చెరవులు, కుంటల్లో నీళ్లు తగ్గి చేపలు ఆశించిన స్థాయిలో పెరుగవని మత్స్యకారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. నాలుగైదేండ్లుగా పుష్కలమైన చేపలను విక్రయించి ఆర్థికంగా భరోసా దక్కిందని, ఇప్పుడు పంపిణీ ఆలస్యం అవుతుండడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా 50శాతం పంపిణీ నిర్ణయాన్ని విరమించుకొని 100శాతం పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.